
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

బుధవారం 7 ఫిబ్రవరి 2024

ఇద్దరు ఏపీవోల సస్పెన్షన్

వికారాబాద్/కులకచర్ల ఫిబ్రవరి 6 : నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ఏపీవోలను విధుల నుంచి తాత్కాలికంగా కలెక్టర్ నారాయణరెడ్డి తొలగించారు. 2023-24 గాను మండలాలవారీగా నర్సరీల నిర్వహణపై లక్ష్యాలను కేటాయించగా, నిర్లక్ష్యం వహించిన పూడూరు ఏపీవో రాములు, కుల్కచర్ల ఏపీవో వెంకటేశ్వర్‌గౌడ్‌లను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ కలెక్టర్‌ఉత్తర్వులు జారీ చేశారు. వారంరోజుల్లో ఎంపీడీవోకు వివరణ అందజేయాలన్నారు.

గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి యాసంగి సాగు ఉమ్మడి జిల్లాలో గణనీయంగా మందగించింది. వానాకాలంలో కాస్త అటు ఇటుగా సాధారణ వర్షపాతం నమోదైనా కురిసిన వానలు సమ్మిళితంగా పడలేదు. మొత్తం సీజన్‌లో పడాల్సిన వర్షపాతం ఒక్క అక్టోబరు నెలలోనే 90శాతం నమోదవడంతో జల వనరుల్లో నీటి లభ్యత కొరవడి యాసంగి సాగుపై ప్రభావం పడింది. చాలా చెరువుల్లో ఇప్పటికే నీరు నిండుకోగా తగ్గుతున్న జలమట్టాలతో బోర్లు కూడా నీరు పోయని పరిస్థితి నెలకొంది. అలాగే గతేడాది చివరి రెండు నెలలు చినుకైనా కురవలేదు. యాసంగి సీజన్ ప్రారంభంలోనూ వర్షాల్లేవు. దీంతో ఇప్పటి వరకు రంగారెడ్డి జిల్లాలో యాసంగి లక్ష్యంలో 26శాతమే పంటలు వేశారు. అలాగే మేడ్చల్‌లో 67.96శాతం, వికారాబాద్‌లో 56.2శాతం చొప్పున ఇప్పటి వరకు సాగు చేశారు.



బషీరాబాద్ మండలం మంతన్‌గౌడ్‌లో వరినాటు పనుల్లో రైతులు, మహిళలు

సాగని యాసంగి

- మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోనూ అంచనాలనందుకోని ఫసల్
- వర్షాభావ పరిస్థితులే కారణం
- చెరువు, కుంటల్లో కొరవడిన నీటి లభ్యత
- భారీగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు
- సాగు, తాగు నీటికి మోగుతున్న ప్రమాద ఘంటికలు
- ఆందోళనలో అన్నదాతలు

రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 26శాతమే సాగు

భారీగా పడిపోతున్న భూగర్భ జలమట్టాలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. గత రెండు నెలలుగా భూగర్భ జలమట్టాలు శరవేగంగా పడిపోతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వేసవికి ముందే నీటి మట్టాలు అడుగంటడంతో యాసంగి పంటలపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. అలాగే వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితులు సైతం కన్పిస్తున్నాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనప్పటికీ ఈ యాసంగి సీజన్ ఆరంభం నుంచి ఒక్కవానా కురవలేదు. దీంతో భారీగా నీటి వాడకంతో జలమట్టాలు పడిపోతున్నాయి. అనేక మండలాల్లో అక్టోబరు, నవంబరు నెలల్లో కనిష్ట స్థాయిల్లోనైనా వర్షాలు పడలేదు. ఈ వేసవిలో నీటిఎద్దడి తలెత్తే ఆస్కారం లేకపోలేదు. పట్టణ ప్రాంతాలు, గ్రామీణ మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పంటలకు, ఇతర అవసరాలకు నీటి వాడకం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు భారీగా తరిగిపోతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 6): ఈ ఏడాది యాసింగి సీజన్ రైతులకు ఆశాజనకంగా కనిపించడం లేదు. గత వానకాలంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటలు సాగు గణనీయంగా పడిపోయింది. యాసంగి సీజన్ దాదాపు ముగింపు దశకు వస్తున్నా ఇప్పటి వరకు సగం విస్తీర్ణంలో కూడా రైతులు పంటలు వేయలేదు. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఎక్కడా ఆశాజనక పరిస్థితుల్లేవు. ముఖ్యంగా మిగతా రెండు జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి జిల్లాలో పరిస్థితులు మరింత దయనీయంగా ఉన్నాయి. కనీస స్థాయిలో కూడా ఈ ఏడాది యాసంగి పంటలు వేయలేదు. రంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 26శాతమే పంటలు వేయగా, వికారాబాద్‌లో 67.96శాతం, మేడ్చల్‌లో 56శాతం చొప్పున సాగు చేశారు. ప్రధాన పంట వరి సాగు భారీగా పడిపోయింది. పలు ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవడంతో బోర్లు పోయక యాసంగి సాగుపై ప్రభావం పడింది. ఫిబ్రవరి మొదటి వారం గుడుస్తున్నా సగం విస్తీర్ణంలో కూడా పంటలు సాగుచేయలేదు. సాధారణంగా యాసంగి సీజన్‌లో సాగు పెరగాలంటే అక్టోబరు నుంచి డిసెంబరు మొదటి వారం వరకు పడిన వర్షాలే ఆధారం. కానీ గత వానకాలంలో ఈ రెండు నెలలూ చినుకైనా పడలేదు. పడ్డ వర్షాలు కూడా అంతటా విస్తారంగా కురవలేదు. పడ్డచోట్ల కొన్ని వానలు భారీగా నమోదైనా చాలాచోట్ల నెలల తరబడి చినుకైనా రాలలేదు. తరి పంటలు అటుంచి మెట్ట పంటలైన మొక్కజొన్న, జొన్న, కంది వంటివి, కూరగాయ పంటలు సైతం సరిగా పండలేదు. అదీగాక వర్షాభావంతో భూగర్భ జలాలు శరవేగంగా పడిపోతున్నాయి. ఈ ప్రభావం యాసంగిపై తీవ్రంగా పడింది. రంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగిలో అన్ని రకాల పంటలు 66,076 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు కేవలం 18,939 ఎకరాల్లో మాత్రం పంటలు వేశారు. లక్ష్యంలో 28.6శాతం మాత్రమే పంటలు వేశారు. ముఖ్యంగా వరి సాగు నామమాత్రంగా ఉంది. యాసంగిలో 40వేల ఎకరాలకు పైగా వరి వేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటి వరకు 457ఎకరాల్లో మాత్రమే సాగైంది. సీజన్ ముగింపు దశకు వస్తున్నా అనేక చోట్ల నారుమళ్లు ఇంకా చేతికందలేదు. ప్రధాన పంటలైన మొక్కజొన్న, శనగ, వేరుశెనగ సాగు సైతం అంతంతమాత్రమే ఉంది. సాగునీటి కొరతే వల్లే ఈ దుస్థితి నెలకొంది. అలాగే వికారాబాద్‌లో ఈ సీజన్‌లో 87,694 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 49,124 ఎకరాల్లో రైతులు పంటలు వేశారు. ఇక మేడ్చల్ జిల్లాల్లో 10,132 ఎకరాల్లో యాసంగి పంటలు సాగుచేయాలని లక్ష్యంగా పెట్టుకోగా 6,886 ఎకరాల్లో మాత్రమే పంటలు వేశారు.

రంగారెడ్డి జిల్లాలో పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	ఈ ఏడాది లక్ష్యం	ఇప్పటి వరకు సాగైంది
వరి	52,470	7,485
జొన్న	780	469
మొక్కజొన్న	6,205	1,178
తృణధాన్యాలు	7,037	1,667
శనగ	6,497	1,306
వేరు శనగ	4,509	5,987
కుసుమ	2,731	2,140

సీజన్‌లో కానరాని వర్షాలు

మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతమే నమోదైనప్పటికీ రబీలో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతోనే రైతులకు ఇపుడు సమస్యలు తలెత్తాయి. రంగారెడ్డి జిల్లాలో సగటు వర్షపాతం 661.5 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 656 వర్షపాతం నమోదైంది. మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లోనూ దాదాపు సగటు వర్షాలు కురిశాయి. అయితే ఇందులో సుమారు 90శాతం వర్షపాతం ఒక్క అక్టోబరు నెలలోనే కురవడం గమనార్హం. తరువాత ఎక్కడా పెద్దగా వర్షాలు పడలేదు. రబీలో పంటల సాగుకు కీలకమైన నవంబరు, డిసెంబరు నెలల్లో నామమాత్ర వర్షాలు తప్ప ఎక్కడా చెరువు కుంటుల్లోకి నీరొచ్చేలా, భూగర్భ జలమట్టాలు పెరిగేలా వానలు పడలేదు.

జిల్లాల్లో వర్షపాత వివరాలు (మిల్లీ మీటర్లలో)

	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం	పెరుగుదల/ తరుగుదల
రంగారెడ్డి	661.5	656	-1%
మేడ్చల్	734.8	793.1	8%
వికారాబాద్	731.5	824.7	13%

జిల్లాల వారీగా యాసంగి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సాధారణ సాగు	ఇప్పటి వరకు సాగు	శాతం
రంగారెడ్డి	74,050	19,204	25.93
మేడ్చల్	10,132	6,886	67.96
వికారాబాద్	87,694	49,124	56.02

మూడు జిల్లాల్లోనూ సీజన్ అంతంతే!

యాసంగి సీజన్ మొదలైన తరువాత వర్షాలు పడక పంటలు సాగుపై తీవ్ర ప్రభావం పడింది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో యాసంగి సాగు అంతంత మాత్రంగా ఉంది. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 26శాతమే పంటలేశారు. మేడ్చల్‌లో 67.96 శాతం, వికారాబాద్‌లో 56.2శాతం వరకు పంటలు వేశారు. నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు కురవకే యాసంగి సాగు సంక్షోభంలో పడింది. యాసంగి సీజన్‌లో ప్రధాన పంటల సాగు అంతంత మాత్రంగానే ఉంది. రంగారెడ్డిలో యాసంగి 52,470ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1,369 ఎకరాల్లో మాత్రమే వేశారు. అయితే ఇంకా అనేక చోట్ల నారుమళ్లు సిద్ధంగా ఉన్నాయి. వికారాబాద్‌లో 45,620 ఎకరాల్లో వరి వేయాల్సి ఉండగా 3,763 ఎకరాల్లో నాట్లు వేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో 9,745 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,475 ఎకరాల్లో నాట్లు వేశారు. వానకాలంలో ఆశించినంత వర్షాలు కురువక భూగర్భ జలాల లభ్యతపై రైతుల్లో ఆందోళన నెలకొంది. వేసిన పంటలకు మరో రెండు నెలలు నీటి తడి అందించాల్సి ఉంది. ఇందుకు సరిపడా వనరుల్లో నీటి లభ్యత ఉంటుందా.. పంటలు చేతికందుతాయా? లేక ఎండుతాయా? అనే సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.



అన్నోజిగూడలో కూల్చివేస్తున్న సిబ్బంది

అక్రమ నిర్మాణాలు నేలమట్టం

- అన్నోజిగూడ, ఫకీర్‌టెక్యాలో కూల్చివేతలు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్‌రూరల్, ఫిబ్రవరి 6 : ఘనాపూర్ అనుబంధ గ్రామం ఫకీర్‌టెక్యాలో మంగళవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు ప్రభుత్వభూమిలో వెలసిన అక్రమనిర్మాణాలను కూల్చివేశారు. ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 1107లో అక్రమంగా నిర్మించిన 9ఇళ్ళు, 3 ప్రహరీలు పోలీసు బందోబస్తు మధ్య ఘట్‌కేసర్ ఇన్‌చార్జి తహసీల్దారు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు.



ఫకీర్‌టెక్యా తండాలో కూల్చివేతలు

ఆందోళనకు దిగినవారిని అరెస్టు చేసి పోచారం ఐటీసీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఎక్స్‌కవేటర్లతో అక్రమనిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఏసీపీ చంద్రశేఖర్, పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ సీఐ రాజు వర్మ, డీటీ సందీప్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనుమతి లేకుండ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేంది లేదని ఘట్‌కేసర్ డిప్యూటీ తహసీల్దార్ సంధీఎరెడ్డి అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల సర్వేనెంబర్ 3/1 వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. అన్నోజిగూడలో 21అక్రమ నిర్మాణాలు, 12 బెస్‌మట్టంలను కూల్చివేసినట్టు అధికారులు తెలిపారు. కూల్చివేతల్లో రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి

- నేటి నుంచి 14 వరకు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్
- జిల్లాలో 766 సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 6: గ్రామాల్లో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించే దిశగా ప్రత్యేక అధికారులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవో, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రత్యేక అధికారులు ఐదేళ్లుగా చేపట్టిన పనులతో పాటు, చేయాల్సిన పనులు, ఆదాయ వనరులపై దృష్టి సారించాలని తెలిపారు. నెలలో మూడుసార్లు నీటి ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రపరిచే విధంగా చూడాలని తెలిపారు. ఆదాయ వరులను సమకూర్చుకునేందుకు ఫిబ్రవరి 28 లోపు ఆస్తి పన్నులు వసూలు చేసే దిశగా కృషి చేయాలని ఆయన కోరారు. ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, వారం రోజులపాటు ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ఉండి ప్రజల సమస్యలపై అవగాహన కల్పించుకొని పనులు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. తడి , పొడి చెత్తను వేరుగా సేకరించి రీసైక్లింగ్ చేసేలా చూడాలన్నారు. జిల్లాలో 59 కోట్లతో మంజూరైన 766 సీసీ రోడ్ల పనులను ఈనెల 15లోపు గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 265 రకాల పనులు చేపట్టేందుకు అవకాశాలు ఉన్నందున గ్రామాలకు పనులు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ , జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, డీపీవో తరుణ్ కుమార్, డీఆర్డీవో కృష్ణన్ , పంచాయతీ రాజ్ ఏఈ ఉమేష్, మిషన్ భగీరథ ఈఈబాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటు పడాలి : మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

కీసర, ఫిబ్రవరి6: గ్రామాల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. మేడ్చల్ జిల్లాలో 61 గ్రామాలకు గానూ ప్రత్యేక అధికారులను నియమించగా, వారికి జడ్పీ కార్యాలయంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే ప్రత్యేక అధికారులు పంచాయతీరాజ్ చట్టంపై అవగహన కలిగి ఉండాలన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికను రూపొందించాలని, అనుభవం ఉన్న అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ప్రతి రెండు నెలలకు జరిగే గ్రామసభలకు ప్రత్యేక అధికారులు అధ్యక్షతన వహించాలన్నారు. ఆదాయ, వ్యయాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధిలో భాగంగా భవనాల అనుమతులు, హెచ్‌ఎండీఏ వెంచర్లు, వెంచర్లలో 10శాతం స్థలం గ్రామపంచాయతీకి అధినంలోకి వచ్చే విధంగా అధికారులు భవనాలకు అనుతులు ఇవ్వాలన్నారు. మంచినీటి సరాఫరా, విద్యుత్, వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పనులు చేపట్టేల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దేవ సహాయం, డీపీవో రమణమూర్తి, డీఆర్‌డీవో పీడీ పద్మాజా రాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

దీపదాస్‌కు ఘనస్వాగతం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 6 : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్ మున్షీకి మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మంగళవారం సిద్దిపేటలో బహిరంగ సభకు వెళ్తున్న క్రమంలో మేడ్చల్‌లోని వివేకానంద చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేషయాదవ్, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌లు గజమాలతో సన్మానించారు. పార్టీ సీనియర్ నాయకులతో పాటు పలువురు స్థానిక కాంగ్రెస్ నాయకులు దీపదాస్‌కు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అంతకు ముందు ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు జంక్షన్ వద్ద గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, శామీర్‌పేట, కీసర, ఘట్కేసేర్, మేడ్చల్ మండలాల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, రమణా రెడ్డి, లక్ష్మన్, చావ రాజు, సందీప్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.



దీపదాస్‌కు గజమాలతో స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

వికారాబాద్ జిల్లాలో స్వల్ప భూకంపం

- రిక్టర్ స్కేల్‌పై 2.5 తీవ్రత నమోదు
- ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి...

వికారాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ జిల్లాలో స్వల్ప భూకంపం నమోదైంది. రిక్టర్ స్కేల్‌పై 2.5 తీవ్రతతో భూకంపం నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ (ఎన్‌సీఎస్) తెలిపింది. సోమవారం మధ్యాహ్నం 1.34 గంటల సమయంలో భూ ప్రకంపనలు సంభవించగా, భూకంపం లోతు 5 కిలోమీటర్ల లోతు వద్ద నమోదైందని ఎన్‌సీఎస్ అధికారులు మంగళవారం వివరించారు. రిక్టర్ స్కేల్‌పై 4 కంటే తక్కువ తీవ్రతతో నమోదయ్యే భూకంపాలు చిన్నవిగా పరిగణిస్తారు. సోమవారం జిల్లాలో సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 2.5 తీవ్రతతో నమోదు కావడం వల్ల ఆ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. వికారాబాద్ జిల్లాలో భూ కంపం, భూప్రకంపనలు సంభవించినట్లుగా నేషనల్ సెంటర్ ఫర్ సెస్మాలజీ చేసిన ప్రకటన చూసి జిల్లా ప్రజలు తీవ్ర ఆశ్చర్యానికి లోనయ్యారు. భూకంపం సంభవించినట్లు తెలిపిన ఎన్‌సీఎస్ అధికారులు వికారాబాద్ జిల్లాలో ఏ ప్రాంతంలో వచ్చిందనేది స్పష్టత ఇవ్వలేదు. ఏడేళ్ల కిందట మర్పల్లి మండలంలో భూ ప్రకంపనలు సంభవించగా, మరోసారి జిల్లాలో భూకంపం తక్కువ తీవ్రతతో నమోదు కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకోగా, మంగళవారం వెలుగులోకి రావడం గమనార్హం.


తొమ్మిది మంది ఎస్‌ఐల బదిలీ

వికారాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ జిల్లాలో తొమ్మిది మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మోమిన్‌పేట్ ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.విఠల్‌రెడ్డిని కరణ్‌కోట్‌కు బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ఎస్.మధుసూధన్‌రెడ్డి చెన్‌గోముల్‌కు బదిలీ అయ్యారు. తాండూరు పట్టణ ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎ.అరవింద్‌ను మోమిన్‌పేట్‌కు బదిలీ చేశారు. చెన్‌గోముల్ ఎస్‌ఐ కె.గిరెన్న పెద్దేముల్‌కు బదిలీ అయ్యారు. బషీరాబాద్ ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.వేణుగోపాల్‌గౌడ్‌ను ధారూరుకు బదిలీ చేయగా, ధారూరు ఎస్‌ఐ ఎం.సంతోష్‌కుమార్‌ను పరిగి ఎస్‌ఐగా నియమించారు. వీఆర్‌లో ఉన్న వి.రమేష్‌కు బషీరాబాద్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. కాగా, పరిగి ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ, పెద్దేముల్ ఎస్‌ఐ కాశీనాథ్‌లకు పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచారు.

కరుణిస్తారా.. పంపిస్తారా?

ఎన్నికల బదిలీలపై కొనసాగుతున్న కసరత్తు !

- ఎన్నికల సంఘం నిర్ణయంపై అధికార వర్గాల్లో ఉత్కంఠ
- ఎన్నికల సంఘానికి ఇది వరకే చేరిన శాఖల వారీగా ఉద్యోగుల వివరాలు
- బదిలీల నుంచి తమను మినహాయించాలని వివిధ శాఖల అధికారుల విన్నపాలు



వికారాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాలు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకి రాగా, కొడంగల్ నియోజకవర్గం మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలోకి వస్తుంది. లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం గత నెలన్నర రోజులుగా కసరత్తు చేస్తోంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్న కేంద్ర ఎన్నికల సంఘం అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంతో కీలకం. ఏళ్ల తరబడి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న అధికారులు అభ్యర్థులకు, పార్టీలకు అనుకూలంగా పనిచేసే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులతో పాటు స్వంత జిల్లాలో పనిచేస్తున్న అధికారులనూ వేరే చోటకు బదిలీ చేసేలా ఇప్పటికే వివరాలు సేకరించారు.శాఖల వారీగా ఉద్యోగుల సమాచారాన్ని ఎన్నికల సంఘానికి పంపించారు. వచ్చే జూన్ నెల వరకు మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకోనున్న అధికారుల వివరాలను సేకరించారు. ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన రెవెన్యూ, పోలీసు అధికారుల సమాచారం మొదట సేకరించగా, ఆ తరువాత ఇతర శాఖల అధికారుల వివరాలు కూడా పంపించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే.

అలాగైతే ఎక్కువ సంఖ్యలో బదిలీలు

లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులను ఒకే యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుంటే అధిక సంఖ్యలో బదిలీలు జరిగే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒకేచోట మూడేళ్లకు పైగా విధులు నిర్వర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులను వేరే జిల్లాలకు బదిలీ చేశారు. అక్కడి నుంచి వచ్చిన అధికారులకు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా కాకుండా లోక్‌సభ నియోజకవర్గం పరిధిని పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ఉమ్మడి జిల్లాను వదిలి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తుంది. ఎన్నికల బదిలీలపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది తదుపరి ఆదేశాలు విడుదలైతేగానీ తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.



ఉద్యోగ వర్గాల్లో ఉత్కంఠ!

ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం లేని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో పనిచేస్తున్న ఉన్నతాధికారులతో పాటు కిందిస్థాయి అదికారుల వివరాలను ఈసారి కేంద్ర ఎన్నికల సంఘం తెప్పించుకుంది. జిల్లా పరిషత్తు సీఈవో, డిప్యూటీ సీఈవో, డీఆర్‌డీవో, జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీవో, ఎంపీడీవో, ఎంపీవోల సమాచారం ఎన్నికల సంఘానికి పంపించారు. ఇప్పటికే ఆయా శాఖల అధికారులు తమను ఎన్నికల బదిలీల నుంచి మినహాయించాలని కోరుతూ సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎన్నికల బదిలీలపై ఎన్నికల సంఘం ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఉద్యోగ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠగా మారింది. ఎప్పుడు బదిలీ ఆదేశాలు జారీ అవుతాయోననే ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పూడూరు, ఫిబ్రవరి 6: సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండల రైతు వేదికలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, ఇఫ్‌కో ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్‌మేళ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పరిశోధన సంస్థలు ఐసీఏఆర్, సీఆర్ఐడీఏ, ఏసీఏఆర్-2ఎంఆర్, ఐసీఏఆర్-2, రాష్ట్ర వ్యవసాయ, ఉద్యాన శాఖ, వెంటర్నరీ శాఖ, ఐఎఫ్ఎఫ్‌సీవో, రాశీ తదితర సంస్థల పరిశోధన అంశాలను, ఉత్పత్తుల స్టాల్స్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ జి.నిర్మల, డాక్టర్ బి.నర్సింహులు, డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ రోహిత్, డాక్టర్ అన్షిధ, ఏడీవో గోపాల్, ఏవో తులసిరాం, ఏఈవో రాంబాబు పాల్గొన్నారు. కాగా,కిసాన్ మేళలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రైతులతో మాట్లాడుతుండగా దామగుండం పరిరక్షణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు నేవీ రాడర్ ఇక్కడ ఏర్పాటు చేయరాదని కోరుతూ మెమోరాండం అందజేసేందుకు వెళ్లారు.ఈ సమయంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సమావేశం నుంచి వచ్చి మీరు వచ్చి ఇక్కడ నేవీ రాడర్‌పై అడగటం ఏమిటని, దామగుండం కమిటీ సభ్యులపై మాటల యుద్ధానికి దిగారు. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఎస్ఐ గిరి, సిబ్బంది వారిని అక్కడి నుంచి బయటికి పంపించారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పన్నుల సొమ్ము అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో వెలుగు చూసిన పన్నుల సొమ్ము స్వాహాపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన దాసరి బాల్‌నర్సింహ 19 జూలై 2023 ఇంటి పన్ను కోసం మున్సిపల్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ అయిన అనితకు రూ.48,500 ఇచ్చినట్లు ఫిర్యాదులో వివరించారు. కానీ నేటికీ అట్టి డబ్బులకు రసీదు ఇవ్వడంలేదని వివరించారు. తరచూ తాను డబ్బుల గురించి కంప్యూటర్ ఆపరేటర్‌ను అడిగితే అట్టి డబ్బులు కౌన్సిలర్ ఆంజనేయులు వద్ద ఉన్నాయని సమాధానమిస్తున్నారని తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో తాను చెల్లించిన సొమ్ముకు రసీదు ఇవ్వకుండా నెలల తరబడి ఇబ్బందుకు గురిచేస్తున్నారని వాపోయారు. అనితపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో దాసరి బాల్‌నర్సింహ, కౌన్సిలర్ కడుపొల్ల మల్లేష్, నాయకులు ముత్యాలు యాదవ్, బర్ల రాదాకృష్ణ, కోరుబోతు నాగరాజు, సాయిచరణ్‌రెడ్డి తదితరులున్నారు.



చిరంజీవికి శుభాకాంక్షలు తెలుపుతున్న వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

చిరంజీవికి 'పద్మవిభూషణ్' అభినందనీయం

మహేశ్వరం, ఫిబ్రవరి 6 : కేంద్ర మాజీ మంత్రి, ప్రముఖ సినీహీరో మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు దక్కడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. ఈమేరకు సోమవారం నగరంలోని చిరంజీవి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ ఎంతో ఉన్నత విలువలు గల చిరంజీవికి పద్మవిభూషణ్ దక్కడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వారి తండ్రి దేవేందర్‌గౌడ్‌కు చిరంజీవికి మధ్య ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తుచేశారు. చిరంజీవిని కలిసిన వారిలో దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యులు విజయేందర్‌గౌడ్, శ్వేత, దివ్యశ్రీలు ఉన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదు

- బీఆర్ఎస్ చెప్పింది కొండంత.. చేసింది గోరంత
- తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే చాలు తప్పక నిలబెట్టుకుంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొటొకటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చేనెల (మార్చి) నుంచి ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నట్లు అమలు చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మవద్దని చెప్పారు. ఆపార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయిందన్నారు. ఆపార్టీ చెప్పింది కొండంత, చేసింది మాత్రం గోరంతేనని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఏం చేయలేకపోయిందని, ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ చేస్తే సహించలేకపోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనురాధ, జడ్పీటీసీ ధారాసింగ్, తహసీల్దారు కిషన్‌నాయక్, వైస్ ఎంపీపీ మధులత, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్ముమాణెమ్మ, కోఆప్షన్ సభ్యులు నసీర్, ఎంపీటీసీలు లొంకనీలు, శంకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, పార్టీ మండల అధ్యక్షులు గోపాల్, మైనార్టీ నాయకులు రియాజ్, రుద్రారం మహిపాల్‌రెడ్డి, సాయిని నారాయణరెడ్డి, డీవై.నర్సింహులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.13కోట్ల నిధులు మంజూరు

తాండూరు: తాండూరు నియోజకవర్గ పరిధిలో గల తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ ఒక్కొక్క మండలానికి రూ.3కోట్ల చొప్పున కోట్‌పల్లి మండలానికి రూ.కోటి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఓప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో తక్షణమే చేపట్టాల్సిన పనులను గుర్తించి నూతనంగా నియమితులైన ప్రత్యేక అధికారుల ద్వారా పనులకు సంబంధించిన తీర్మానం తీసుకొని వెంటనే గ్రామాల్లో పనులు ప్రారంభించాలన్నారు. అదేవిధంగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు గ్రామాలకు వెళ్లి పనుల త్వరగా పూర్తి చేసేవిధంగా చూడాలని కోరారు.



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

భద్రేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

తాండూరు పట్టణంలో గల శ్రీ భావిగి భద్రేశ్వర స్వామిని మంగళవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యేను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వీరశైవ సమాజం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఓటు హక్కు ఎంతో విలువైనది

రంగారెడ్డి అర్బన్, ఆదిభట్ల, ఫిబ్రవరి 6 : ప్రజాసామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైనదని, దానిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ గణేష్ అన్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో మంగళవారం సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీనివాస మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులను కలెక్టరేట్‌లో ఫీల్డ్ విజిట్‌కు తీసుకెళ్లారు. ఈవీఎం మిషన్ల పనితీరు, వినియోగం, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు




నెక్ జోనల్ కమిటీ ఎన్నికల్లో సభ్యుల వాదోపవాదాలు


నెక్ జోనల్ కమిటీ ఎన్నిక రద్దు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 6: షాద్‌నగర్‌లో నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఎన్నికల్లో గందరగోళం, ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో మంగళవారం ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. షాద్‌నగర్‌లోని బీవీరావు నగర్‌లో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల జాబితాలో పేర్లు ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలని ఓ వర్గం పట్టు బట్టింది. కానీ లీజుదారులకు ఓటు వేసే హక్కు లేదని మరో వర్గం వాదించింది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరు వర్గాలు వాదించుకోవడంతో ఎన్నికల అధికారి నారాయణ రావు ఎన్నికను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆశాజనకంగా కందుల ధరలు



ధారూరు, ఫిబ్రవరి 6: ఈసారి కంది పంట సాగు విస్తీర్ణం తక్కువగా ఉన్నా మార్కెట్‌లో కందుల ధరలతో పాటు పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూడు వారాలుగా ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో కందుల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. గతేడాది కన్నా ఈసారి కందుల ధరలు పెరగటంతో కంది రైతులు లాభాలు బాటలో ఉన్నారు. మార్కెట్‌లో కందులు ధరలు ప్రస్తుతం క్వింటాలుకు రూ.10వేల నుంచి రూ.10,400ల వరకు పలుకుతున్నాయి. కందుల ధరలు ఆశించిన విధంగా ఉండటంతో రైతులు కందులను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కందుల ధరలు పెరిగే అవకాశమున్నందన్న అంచనాతో కొందరు రైతులు కందులను విక్రయించకుండా నిల్వ ఉంచుకున్నారు. కందుల ధరలు క్వింటాలుకు రూ. 12వేల వరకు పెరగవచ్చనే ఆశతో కొంతమంది రైతులు ఎదురుచూస్తున్నారు. పత్తి ధరల కన్నా కంది పంట ధరలు బాగా ఉన్నాయని పత్తిసాగు చేసి పంట దిగుబడి, ధరరాక నష్టపోయామని పత్తిరైతులు వాపోతున్నారు.





44వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 6: ఖరీఫ్ సీజన్ 2023-24లో భాగంగా జిల్లాలో ఇప్పటి వరకు 44వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం రైస్ మిల్లర్లతో సీఎంఆర్ ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి వెంటనే డెలివరీ చేసే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన వరిధాన్యాన్ని జిల్లాలోని 27 రైస్‌మిల్లర్లకు సీఎంఆర్ కోసం అందజేసినట్లు తెలిపారు. ఈ ధాన్యాన్ని వెంటనే ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని మిల్లర్లను ఆదేశించారు. రైస్ మిల్లర్లు తమ మెల్లింగ్ సామర్థ్యం ప్రకారం ప్రతీరోజు సీఎంఆర్ రైస్ డెలివరీ చేయాలని సూచించారు. ఇట్టి ధాన్యాన్ని ఎవరైనా రైస్ మిల్లర్లు రీసైక్లింగ్‌కు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అందరు మిల్లర్లు 2023-24 సంవత్సరానికి సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను వెంటనే డెలివరీ చేయాలని ఆదేశించారు. పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు రోజూ మిల్లుల్లో ధాన్యాన్ని తనిఖీ చేసి వెంటనే ఎఫ్‌సీఐకి విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పూర్వసరఫరాల అధికారి రాజేశ్వర్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ కొండల్‌రావు, పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 6: పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మోమిన్‌పేట్, బంటారం, కోట్‌పల్లి మండలాల ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్స్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. వచ్చే వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలతో విద్యాబోధన చేయాలన్నారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు, ఎంఈవో గోపాల్, విద్యాసాగర్, చంద్రప్ప, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



అన్నోజిగూడ వద్ద పైప్‌లైన్ పగిలి సీసీ రోడ్డును పెకిలించుకొని ఉబికివస్తున్న కృష్ణానీరు

కృష్ణ కృష్ణా..!

- పైప్‌లైన్ పగిలి వృథా అవుతున్న తాగునీరు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: వందల కిలోమీటర్ల దూరం నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు తీసుకువచ్చిన కృష్ణా తాగునీరు అధికారుల పర్యవేక్షణ లోపంతో వృథా అవుతోంది. పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన కృష్ణానీటి పైప్‌లైన్ పగిలిపోయి చాలాసేపు తాగునీరు వృథాగా పోయింది. దాదాపు కిలోమీటర్ పొడవున నీరు పారుతుండడంతో ఎర్రటి ఎండలో మిట్టమధ్యాహ్నం రోడ్డుపై వరదలేంటని పలువురు ఆశ్చర్యపోయారు. అధికారులకు సమాచారం అందించడంతో నీటి సరాఫరాను నిలిపివేశారు.





ఇబ్రహీంపట్నం: మెడల్స్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో 'పట్నం' విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. ఈనెల 3, 4వ తేదీల్లో కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాలో బ్రైట్‌స్టార్ కరాటే అసోసియేషన్, విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. బొంగులూరు నలంద గ్రామర్ స్కూల్‌కు చెందిన అక్షిత, జ్యోత్స్న, శ్రీనిత్ కుమార్, ఇబ్రహీంపట్నం ఆంగ్లిస్టు హైస్కూల్‌కు చెందిన సాత్విక్, ప్రియాంక హైస్కూల్‌కు చెందిన గీతేశ్వర్, శ్రీచైతన్య స్కూల్‌కు చెందిన శ్రీహర్షరెడ్డిలు గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ యు.శ్రీనివాస్ తెలిపారు.


క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు

మొయినాబాద్ రూరల్ : క్రీడలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుందని మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ బండరి మంజుల అన్నారు. మండల పరిధిలోని మొయినాబాద్‌లోని మాస్టర్ మైండ్స్ పాఠశాలకు చెందిన విద్యార్థిని టి.మధు నగరంలో నిర్వహించిన ఇంటర్‌నేషనల్ కరాటే చాంపియన్‌షిప్(ఆల్‌స్టైల్) పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందంతో కలిసి సన్మానించి అభినందించారు. అనంతరం మధు తల్లిదండ్రులను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్లు రవియాదవ్, రమేష్‌యాదవ్, ధరణికుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరుగు పందెంలో కొత్తపేట విద్యార్థినుల ప్రతిభ

కేశంపేట : హైదరాబాద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో భాగంగా సబ్ జూనియర్ అథ్లెటిక్ మీట్‌లో కేశంపేట మండలం కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మంగళవారం నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో 7వ తరగతి విద్యార్థినులు స్పందన రెండో బహుమతి, సుప్రియ మూడవ బహుమతి సాధించారు. విద్యార్థినీలతో పాటు పీఈటీ శిరీషలను హెచ్‌ఎం చంద్రశేఖర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాససాగర్ అభినందించారు.





సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు


కొడంగల్:బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు


వికారాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్ రెడ్డి

కొడంగల్, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.కృష్ణంరాజు అన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌నాయక్, భీమారాజ్, లక్ష్మణ్, షాకీర్, రాజునాయక్, నర్సింహా, ఆసిఫ్ ఖాన్, తార్యానాయక్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి పట్ల మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి చౌరస్తాలో దిష్టిబొమ్మకు చెప్పులదండ వేసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావ్, బోడివెంకటొరెడ్డి, వీరన్న, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వికారాబాద్: కేసీఆర్, కేటీఆర్, కవిత పెంచుకున్న పెంపుడు కుక్క మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు సరికాదని మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదాన్నారు. కాంగ్రెస్ పార్టీ సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని, ఈ విషయాన్ని కేసీఆర్ అసెంబ్లీలో చెప్పినట్లు తెలిపారు. కాంగ్రెస్ బిక్షతోనే బీఆర్ఎస్ నాయకులు పదవులు అనుభవించారని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాల్కసుమన్‌పై చర్యలు తీసుకోవాలని నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు కిషన్‌నాయక్, రమేష్, షరీఫ్, రాజు, మురళి, వేణు, లక్ష్మణ్, చందర్ నాయక్, మల్లేశ్, శ్రీనుముదిరాజ్, వెంకటయ్య గౌడ్, రవీందర్ పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్పల్లి: మర్పల్లి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం బాల్క సుమన్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలీమోద్దీన్, రాచన్న, సాయిపటేల్, జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఖాసీం, పంతులబాయి శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, మహిపాల్ పాల్గొన్నారు.

బంట్వారం(కోట్‌పల్లి): సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని కోట్‌పల్లి, బంట్వారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింగ్ నాయక్, వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో వారు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, నాయకులు రంగారెడ్డి, నర్సింహులు, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశం, శాకం రాములు, యాదగిరి, గిరిదాస్, శంకర్ యాదవ్, కోట్‌పల్లి నాయకులు బందెయ్య, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్/నవాబుపేట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్, నాయకులు బాల్క సుమన్‌పై ఫిర్యాదు చేశారు. అదేవిధంగా నవాబుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకటొరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విలేకరులతో మాట్లాడారు. బాల్క సుమన్‌పై పోలీసులు చట్టరీత్యా చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు.

యాలాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు భీమయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బాల్క సుమన్‌కి తగిన బుద్ధిచెప్పడం ఖాయమన్నారు.


మేడ్చల్ టౌన్: పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నేతలు

మేడ్చల్‌లో..

మేడ్చల్ టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిని కించపరిచే విధంగా అనుచిత వాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడ్చల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రత్యేకాధికారుల పాలనలో సమస్యలు రావొద్దు


మాట్లాడుతున్న జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కోటాజీ

దోమ, ఫిబ్రవరి 6: సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కోటాజీ అన్నారు. దోమ ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి


కులకచర్ల తహసీల్దార్ కార్యాలయంలో డీలర్‌లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ మురళీధర్

కులకచర్ల, ఫిబ్రవరి 6: రేషన్ దుకాణాల వద్ద డీలర్లు తప్పనిసరిగా బోర్డులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈకేవైసీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ నెల చివరి వరకు అవకాశం కల్పించిందని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రేషన్ దుకాణాలకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కీ రిజిస్టర్‌లో పంపిణీ వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌లు ఆశీష్, గణపతి, డీలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌లపై అవిశ్వాసం

శామీర్‌పేట, ఫిబ్రవరి 6: తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్‌పర్సన్ పన్నాల వాణీవీరారెడ్డిలపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ మెజార్టీ కౌన్సిలర్లు సోమవారం మేడ్చల్ కలెక్టర్‌కు అవిశ్వాస వినతిపత్రం అందజేశారు. తూంకుంటకు చెందిన 4వవార్డు కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి నాయకత్వం వహిస్తూ మున్సిపాలిటీకి చెందిన మిగా 10మంది వార్డు కౌన్సిలర్లను కలిసి సంతకాలను సేకరించారు. ఈ అవిశ్వాసం పట్ల కలెక్టర్ ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా తూంకుంట మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్ లపై అవిశ్వాసం పెట్టేందుకై ఎనిమిది మంది కౌన్సిలర్లను 4వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి పకడ్బందీ వ్యూహంతో టూర్‌క్యాంపునకు తీసుకెళ్లారు. ముగ్గురు కౌన్సిలర్లు సురేష్, పూజభరత్, ఉమాఆంజనేయులు చాకచక్యంగా చివరి క్షణంలో టూర్ క్యాంపు నుంచి తప్పించుకున్నారు. పనులు చేయించేందుకై కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి తమ వద్ద సంతకాలు చేయించుకున్నాడని ఆ ముగ్గురు కౌన్సిలర్లు మంగళవారం కలెక్టర్, తూంకుంట మున్సిపల్ కమిషనర్ లకు వినతి పత్రాలను సమర్పించారు. 11 మంది కౌన్సిలర్లలో ముగ్గురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకోగా ఇంకా ఎనిమిది మంది కౌన్సిలర్లు సంతకాలు చేస్తే అవిశ్వాసం నెగ్గనుంది.

సమ్మెను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6 : కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేఖంగా ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు చింతల యాదయ్య, కల్లూరి జయచంద్ర కోరారు. పోచారం మున్సిపాలిటీ ఆర్జీకే కాలనీలో మంగళవారం సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అలివేలు, సునిత, ధనలక్ష్మి, అశోక్, లత, హేమలత, కిరణ్, బసవయ్య, మురళి, సోమన్న, ఆనంద్, పాండు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 6: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, ప్రత్యేకాధికారి శైలజారెడ్డి అన్నారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి ఫేరోజ్‌ఖాన్‌కు సూచించారు. గ్రామాల్లో ప్రతీ రోజు ఉదయం పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సాయిలు, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఏఐ విభాగాల్లో అధిక ఉద్యోగ అవకాశాలు


పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువని వెల్‌ట్రిస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రిసోర్స్ పర్సన్ అబ్దుల్ ఖద్దూస్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మంగళవారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో డీప్ డైవ్ ఇన్ మెషిన్ లెర్నింగ్ జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయకుమార్, మల్లికార్జున్‌రెడ్డి, దీపిక, తృప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్ ముదిరాజ్

పూడూరు, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ మండల కార్యకర్తలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మల్లేష్ పటేల్ ముదిరాజ్ అన్నారు. పూడూరు మండల కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి దామగుండం నేవీస్టేషన్‌పై మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తే అక్కడి కాంగ్రెస్ కార్యకర్తలు కనీస అవగాహన లేకుండా చిల్లరగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. రాడర్ స్టేషన్‌పై ఎమ్మెల్యే బహిరంగ సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నేవీ రాడర్ వస్తే ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని ప్రజలకు మాయ మాటలు చెప్పి సొంత సౌలభ్యం కోసమే ఎమ్మెల్యే ఇక్కడ నేవీ రాడర్ స్టేషన్ పెట్టి తాను ఎదగాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, సుభాన్, బుచ్చన్న, పాండు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

మూడుచింతలపల్లి, ఫిబ్రవరి 6: మరమ్మతుల కారణంగా లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు(బుధవారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ లక్ష్మాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లక్ష్మాపూర్, 11 కేవీ మూడుచింతలపల్లి ఫీడర్లలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మూడుచింతలపల్లి, పోతారం, వ్యవసాయ క్షేత్రాలు, పారిశ్రామిక వాడల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు ఎమ్మెల్సీ కవిత రాక

వికారాబాద్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వికారాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమయ్యే ఈ సమావేశంలో అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహం ప్రతిష్ఠించాలని డిమాండ్‌తో బీసీ డిక్లరేషన్, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించే విషయమై చర్చ ఉంటుందని వారు వివరించారు. బీసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

వరి పొలాల సందర్శన


పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, అధికారులు

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 6: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌బాబు, ఏరువాక కేంద్రం తాండూర్ కో ఆర్డినేటర్ లక్ష్మణ్ మండలంలోని మెట్లకుంట, బురాన్‌పూర్ గ్రామాల్లో మంగళవారం వరి పొలాలను సందర్శించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బొంరాస్‌పేట్ వ్యవసాయ శాఖ అధికారి తిప్పేస్వామి, భార్గవి, కావలి సత్యం, సుదర్శన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సూర్యప్రకాశ్, గోపాల్, దేవుజనాయక్, మల్లేశం పాల్గొన్నారు.

విహార యాత్రకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు


విహార యాత్రలో కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 6: కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తెలుగు డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌కు విహార యాత్రకు వెళ్లారు. అక్కడ చిలుకూరు బాలాజీ జగన్నాథ స్వామి దేవాలయం, శిల్పారామం తదితర ప్రదేశాలను విద్యార్థులకు చూయించినట్లు అధ్యాపకులు బి.మోహన్, బి.నర్సిములు, స్వప్న తెలిపారు.

స్వయంపాలన


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పూడూరు, ఫిబ్రవరి 6: కడుమూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం హెచ్ఎం మధు అధ్యక్షతన స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌గా శ్రీమన్ తేజ డీఈవోగా ప్రణతి, ఎంఈవో సృజనాక్షి, హెచ్ఎంగా క్రాంతికుమార్, ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ సత్యనారాయణ, సురేష్, విద్యావేత్త సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ యాదమ్మ, పోచయ్య, మాజీ సర్పంచ్ సలీమా, బి.శ్రీకాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ ఎస్ఐగా అరవింద్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 6: మోమిన్‌పేట్ నూతన ఎస్ఐ అరవింద్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్ఐ విధులు నిర్వహించిన విఠల్‌రెడ్డి కరన్‌కోట్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో తాండూర్ టౌన్‌లో విధులు నిర్వహిస్తున్న అరవింద్ మోమిన్‌పేట్ ఎస్ఐగా బదిలీ అయ్యారు.

బీజేపీ జిల్లా మెడికల్ కన్వీనర్‌గా డాక్టర్ లక్ష్మణ్

శామీర్‌పేట, ఫిబ్రవరి 6 : బీజేపీ మేడ్చల్ జిల్లా మెడికల్ నూతన కన్వీనర్‌గా శామీర్‌పేట మండలం అలియాబాద్‌కు చెందిన డాక్టర్ మంచినీళ్ళ లక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఉత్తర్వులను జారీ చేసి లక్ష్మణ్‌కు అందజేశారు.

క్రైం కార్నర్

డివైడర్ దాటుకొని వచ్చి ఢీ

- ఓఆర్ఆర్‌పై కారును ఢీ కొన్న మరో కారు
- అక్కడికక్కడే ఒకరు.. ఆస్పత్రిలో మరొకరి మృతి


ఓఆర్ఆర్‌పై ప్రమాదానికి గురైన కారు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో ఔటర్ రింగ్ రోడ్‌పై వెళుతున్న ఓ కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కేసింది. అంతటితో ఆగక అదే వేగంతో దూసుకెళ్లి ఎదురు లేన్‌లో వస్తున్న మరో కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు కారులోనే చనిపోయారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వనస్థలిపురం నివాసి రెడ్డప్పరెడ్డి(50) సోమవారం రాత్రి ఓఆర్ఆర్ మీదుగా కారులో ఇంటికి వెళుతున్నారు. మేడ్చల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్ దాటి అతివేగంగా వచ్చి రెడ్డప్ప కారును ఢీకొంది. దీంతో రెడ్డప్ప కారులోనే చనిపోయాడు. ప్రమాదానికి కారణమైన కారు శామీర్‌పేట వైపు నుంచి మేడ్చల్ వైపు వస్తుండగా.. రెడ్డప్ప ప్రయాణిస్తున్న కారు దుండిగల్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళుతోంది. విషయం తెలుసుకున్న ఓఆర్ఆర్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న రెడ్డి గణేశ్, మంగళపు గణేశ్, మోక్షిత్ రెడ్డిలను కారు నుంచి బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రెడ్డి గణేశ్(18) మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులను దుండిగల్ సమీపంలోని మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు.

గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 6: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డబీల్‌పూర్ గ్రామ పెద్దచెరువులో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డబీల్‌పూర్ పెద్ద చెరువులో మంగళవారం ఓయువతి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నీటి నుంచి వెలికి తీశారు. మృతురాలి వయసు సుమారు 25-30సంవత్సరాల మధ్య ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు.

మూతపడిన క్వారీలో వ్యక్తి మృతదేహం..

పెద్దేముల్, ఫిబ్రవరి 6: మూతపడిన క్వారీలో మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మండలంలోని నవాంద్గి గ్రామానికి చెందిన వడ్ల వీరేశం గతనెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. అతడికి గతేడాది ప్రమాదవశాత్తు తలపై గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయాడని కుటుంబసభ్యులు తెలిపారు. మంగళవారం ఆత్కూర్ తండా శివారులో మూతపడిన క్వారీలో వ్యక్తి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అయితే పోలీసుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లి చూసిన కుటుంబసభ్యులు మృతుడు వడ్ల వీరేశంచారిగా గుర్తించారు. మృతుడి అన్న శ్రీనివాసచారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

యాలాల, ఫిబ్రవరి 6: అనుమానాస్పద స్థితిలో ఓవ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం జరుగగా, మంగళవారం వెలుగులోకి వచ్చింది. యాలాల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జుంటిపల్లి గ్రామానికి చెందిన పెండ్యాల జనార్దన్‌రెడ్డి(46) సోమవారం ఉదయం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. మధ్యాహ్నం అయినా జనార్దన్‌రెడ్డి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతడి జాడకోసం వెతికారు. సాయంత్రం పొలం దగ్గరకు వెళ్లి చూడగా వరినారు మడిలో జనార్దన్‌రెడ్డి పడిఉండగా కనిపించాడు. మొరంపై నడుస్తూ వెళ్తుండగా కాలుజారి పడి నారుమడిలో ఊపిరాడక మృతిచెంది ఉంటాడడని ఎస్ఐతో పాటు గ్రామస్తులు పేర్కొంటున్నారు. కాగా మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని తెలిపారు. మృతుడి భార్యకు, కుటుంబీకులకు ఎలాంటి వారిపై అనుమానాలు లేవని, మృతుడి భార్య శ్రావని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

అనుమతులు లేని ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తాండూరురూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని చంద్రవంచ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదనరెడ్డి తెలిపారు. చంద్రవంచ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ మధుసూదనరెడ్డి మంగళవారం సిబ్బందితో వాగు వద్దకు వెళ్లారు. ఇసుక తరలిస్తున్న డ్రైవర్ వద్ద ఎలాంటి అనుమతిపత్రాలు లేకపోవడంతో పారిపోయాడని తెలిపారు. ఈ మేరకు ట్రాక్టర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించి, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ కేసులు పెట్టారని అర్ధనగ్న ప్రదర్శన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 6: ఘట్‌కేసర్ పోలీసులు తనపై అక్రమ కేసులు పెట్టారని బీజేపీ నాయకుడు మహిపాల్‌రెడ్డి మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్నంగా ఆందోళన చేసి నిరసన వ్యక్తం చేశాడు. నాలుగు రోజుల కిందట ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలో వృద్ధురాలు అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డిపై పాత కక్షలతో దాడి చేసిన విషయం తెలిసిందే. ఈదాడి విషయమై ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ జరిపిన పోలీసులు మహిపాల్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈవిషయమై మహిపాల్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రతీ విద్యార్థి క్రీడానైపుణ్యం కలిగి ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 6: ప్రతీ విద్యార్థి క్రీడా నైపుణ్యం కలిగి ఉండాలని విజ్ఞాన భారతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎన్.గౌతంరావు తెలిపారు. బిట్స్ పిలానిలో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్‌లో విజ్ఞానభారతి కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలువడంతో మంగళవారం అవుషాపూర్‌లోని విజ్ఞానభారతి ఇంజనీరింగు కళాశాలలో క్రీడాకారులకు అభినంధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రసాద్, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతను చాటుకుందాం

పెద్దేముల్, ఫిబ్రవరి 6: సగరు(ఉప్పర)ల ఐక్యతను ప్రపంచానికి చాటిచెప్పాలని సగర సంఘం తాండూరు అధ్యక్షుడు ఉప్పరి అనంతరాం పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో గతంలో జరిగిన ఎన్నికలలో ముగ్గురు వార్డుసభ్యులు, ఒక సర్పంచ్. ఒక ఎంపీటీసీ సగర కులానికి చెందిన వారు ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందారు. ప్రస్తుతం సర్పంచ్, వార్డు సభ్యుల పదవికాలం ముగిసిపోవడంతో సర్పంచ్ రేగొండి శ్రవణ్‌కుమార్, వార్డు సభ్యులు మంతటి యాదప్ప, హకీంపేట్ శ్రీనివాస్, గొబ్బురు నీలమ్మలను సంఘం తరపున సన్మానించారు. పూలమాలలు శాలువాలు కప్పి వారిని సత్కరించారు. ఈకార్యక్రమంలో మల్లేశం, పుల్లప్ప, శ్రీనివాస్, రవీందర్, అశోక్‌బాబు, నర్సింహులు, శాంత్‌కుమార్ పాల్గొన్నారు.

'పోరాడితేనే రాజ్యాధికారం'

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 6: పోరాడితేనే రాజ్యాధికారం వస్తుందని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బురుగుపల్లి కృష్ణయాదవ్ అన్నారు. ఆయన కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో సమాన వాటా దక్కకుండా, సమగ్ర అభివృద్ధి చెందకుండా పాలకులు పరిపాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన బండారి శాంతికుమార్‌కు టికెట్ కేటాయించి సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమలో బీసీ సేన నాయకులు గొడుగు నర్సిములు, గొండ్ల భాస్కర్, నరేశ్, నర్సింహులు, పకీరప్ప, బసప్ప, మల్లేశ్, వెంకటప్ప, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **పూడూరు:** మండలంలోని కంకల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరీ రామచంద్ర యాదవ్‌ను గ్రామస్తులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ తన వంతుగా విగ్రహ ఆవిష్కరణకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల దామోదర్, బేరీ కృష్ణ యాదవ్, రవీంద్ర, కంకల్ అశోక్, శ్రీనివాస్, ఆంజనేయులు, రాము, వంశీ పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన డీసీసీబీ సమావేశంలో నూతనంగా ఎన్నికైన బొంరాస్‌పేట్ మండలంలోని మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జయకృష్ణను, దమ్‌గాన్‌పూర్, మోమినాపూర్ పీఏసీఎస్ చైర్మన్‌లను డీసీసీబీ ఉపాధ్యక్షుడు వెంకటయ్య, డైరెక్టర్‌లు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటరమణగౌడ్, మల్లేశ్, రాజేశొరెడ్డి, దేశ్యానాయక్, నర్సిములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** ఈ నెల 12న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కులకచర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారిని మాధురి అన్నారు. ఆసుపత్రిలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆరోగ్య సిబ్బందికి మంగళవారం ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు సగం ట్యాబెటు, 3 నుంచి 19 సంవత్సరాల వారికి ఒక ట్యాబ్లెట్ భోజనం చేసిన తర్వాత వేయాలన్నారు. ఉమ్మడి కులకచర్ల మండలాల్లో కలిపి మొత్తం 14119 మంది పిల్లలు ఉన్నారని, వీరిలో బాలికలు 7064 మంది ఉండగా బాలురు 7055 మంది ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రాసి అధికారి హరిత, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, ఆరోగ్య సిబ్బంది రత్నలత, విజయలక్ష్మి, యాదమ్మ, ఫాతీమా, వెంకటయ్య అంజు పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ఘనంగా అన్నదానం జరిగింది. భక్తులు అమ్మవారికి ఓడిబియ్యం పోసి బోనాలను సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అల్వాల్ ప్రాంతానికి చెందిన తుమ్మల నరేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య లక్ష్మీ, కుటుంబ సభ్యులు నవ్య, పవన్‌రెడ్డిలతో పాటు శామీర్‌పేటకు చెందిన వజ్జల స్వరూప కుటుంబ సభ్యులు 25 కేజీల బియ్యం, మంచి నూనె, కూరగాయలు అందజేసి అన్నదానం చేపట్టగా పశ్చిమగోదావరి జిల్లా పూళ్ళ గ్రామానికి చెందిన వర్ధినేడి రంగయ్య, ధనలక్ష్మి దంపతులు పరమాన్నంను వితరణ చేశారు. అలాగే శామీర్‌పేటకు చెందిన దేశం నరేష్‌గౌడ్, మేఘన దంపతులు, వారి కూతూరు కుషిలు వంట కట్టెలు అందజేశారు బీజేపీజిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హృదయ్‌కుమార్‌లు అన్నదానంలో పాల్గొన్నారు.

● **పూడూరు:** తమ డిమాండ్ల సాధన, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16వ తేదీన ఆశావర్కర్లు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ పిలుపునిచ్చారు. పూడూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సమ్మె పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.